# ఇరుగు - పొరుగు

మన ఇంటి ప్రక్కన వున్నవాళ్ళను బట్టి వుంటుంది మన సౌఖ్యం.

ఇరుగూ పొరుగూ అన్నారు. మనకు కీర్తి వచ్చినా అపకీర్తి వచ్చినా వాళ్ళవల్లే వస్తుంది. మన ఇంటి ప్రక్కన ఒక ప్లీడరు గుమస్తా ఉన్నాడనుకోండి. ఇక మన కర్మం కాలిందన్న మాటే. ఆ ఇంట్లో అత్తకూ కోడలకూ పడదు. అత్త ఆ పిల్లను కాల్చుకుతింటూ వుంటుంది. ఆ పిల్ల అప్పుడప్పుడు మన ఇంటికి వస్తూ వుంటుంది. ఆ అమ్మాయి మనతో ఏవో నేరాలు చెప్పుతున్నదని ఆ ముసలిదానికి అనుమానం.

ఓ మారు సరిగ్గా అలాగే జరిగింది గదా. మా ఆవిడ మా ఇంటి ప్రక్కావిడ కోడలూ ఒక్క ఈడువాళ్ళు. అంచేత ఆ పిల్ల మా ఇంటికి వచ్చి ఏదో పిచ్చాపాటి కాసేపు మాట్లాడుకొని వెళ్ళిపోతుండేది. ఆ ముసలిదానికి మా ఆవిడపైన కొర్రుగా వుండేది. ఏమీ అనలేక వీలైనప్పుడల్లా ఏవో సూటీపోటీ మాటలు అనటం సాగించింది.

అందరిళ్ళల్లోనూ వుంటై తగూలు, పొరుగింటి తగూ అంటే కొందరు చెవి కోసుకుంటారు. అత్తమామల్లో, ఆడబిడ్డల్లో కాపురం చేయకుండా అదృష్టవశాత్తు పొరుగూరిలో ఒంటరి కాపురం చేస్తూన్నది కాబట్టి ఆ కాంతమ్మ రింగురంగా అంటూ కులుకుతున్నదీ. అర్థశేరు బియ్యం అత్తెసరు వేసి, రెండు వంకాయలు వేయించిందా అంటే ఇక పనేలేదు ఆ అమ్మాయికి. అల్లాగ వుండాలంటే ఎల్లాగ వీలు అవుతుందమ్మా అం[illegible]రికీ-[illegible] ఇల్లాగ ఏవో సాధింపు మాటలు అంటూ వుండేది. అప్పుడు మా కాంతం కొత్తగా కాపురానికి వచ్చిన రోజులు. ఇంకా మాకు సంతానం కలగలేదు.

పిల్లా జల్లా లేకుండా ఒంటరి కాపురం చేస్తున్న రోజుల్లో పొరుగింటి వాళ్ళు ఎలాంటివాళ్ళు అయినా మనకు అట్టే బాధ వుండదు. అయితే కాస్త జాగ్రత్తగా వుండా[illegible]ందల్లా భార్య పుట్టింటికి వెళ్ళినప్పుడే, ఆ నాలుగు నెలలో ఆరు నెలలో మటుకు వంచిన తల ఎత్తకుండా నడవాలి ఆ వీధిలో. అప్పుడే మన గౌరవం దక్కుతుంది. ఇంటావిడ, బిడ్డకు మూడో నెల వెళ్ళక మునుపే వచ్చినపుదు, ఇంటి ప్రక్కవాళ్ళు మనలని గురించి మంచిగా చెబుతారు. లేక...

నీవు ఒకరోజున స్నానంచేస్తూ వుండటం. ఆ సమయాన్నే పొరిగింటి ఆవిడ కోడలు పూల జడ వేసుకొని దొడ్డి గోడ మీదుగా తొ౦గి చూడటం నీవు ఆ చక్కని పిల్లను నివ్వెరపోయి చూస్తూ అవతల వంటింటి గుమ్మంలో నుంచి ఆ అమ్మాయి అత్తగారు గుడ్లు మిటకరించి చూస్తున్నట్లు గమనించక పోవటం, ఇత్యాది విషయాలు జరిగినయ్యో, నీ కర్మం కాలిందే.

అసలే అనుమాన పడుతుంటుంది మీ ఆవిడ. మొగుడి మీద ప్రేమ వున్న ప్రతి మానవతికి అటువంటి అనుమానం వుండటం సహజం. అందులో తాను లేనప్పుడు ఏమి అన్యాయం జరిగిందోనని భయపడుతూనే వస్తుంది మీ ఆవిడ. వచ్చీ రావటంతోనే కొంప మునిగిపోయినట్లు పనిగట్టుకొని వచ్చి ఆ ముసలిముండ నీ మీద నేరాలు చెప్పేస్తుంది వున్నది కొన్ని, లేనిపి కొన్నీని. నీవు ఎంతో ఉత్సాహంతో ఇంటికి వస్తావు. ఎన్నాళ్ళకో వచ్చిన భార్యను చూచి కబుర్లు చెప్పుకుందామనీ, బిడ్డను ముద్దాడుదామనీ ఆదుర్దాతో ఇంటికి వచ్చేసరికి బుసబుసలూ రొసరొసలూ మీ ఆవిడ. కారణమా నీకు తెలియదు. ఆవిడ చెప్పనూ చెప్పదూ. ఏమిటి కాంతం, అది నేననేమాట. నీవు కూడా ఏదో పేరుపెట్టి పిలుస్తావుగా. ఏమిటే రాజ్యం, సుబ్బులూ, లక్ష్మీ (ఏదో ఒకటి) ఎందుకే అల్లాగ వున్నావు. సంతోషంగా లేవేం? అమ్మాయికి ఇంకా నీళ్ళు పోశావుకావేం, మధ్యాహ్నం కాఫీ తాగలేదా? అంటూ ఏవో వెయ్యి ప్రశ్నలు వేస్తావు. నా సంగతి మీకెందుకు లెద్దురూ. మీకు నేనే కావలసి వచ్చాను అనో, లేకపోతే ఇంకా మృదువుగానో ఏదో నీరసం మాట అనేస్తుంది మీ ఆవిడ. అసలు సంగతి చెప్పదు. ఆ సాయంత్రం నీవు బ్రతిమిలాడిన ఒట్టిదే, భయపెట్టినా ఒట్టిదే. ఆ రాత్రికి ఎప్పుడో బయట పెడుతుంది అసలు సంగతి నీవు ఎంతో బ్రతిమిలాడిన తరువాత. ఆ తరువాత అదంతా అబద్ధం అని నచ్చజెప్పేటప్పటికి తలప్రాణం తోకకు వస్తుంది. ఇదేమైనా నలుగురిని పిలిచి నిలవదీసి అడిగి నిజం తేల్చే విషయం కాదాయె. ఎల్లాగ మీ ఆవిడను నమ్మించటం. చాలా కష్టం, ప్రాణంమీదికి వస్తుంది.

కాబట్టి ఇరుగూ పొరుగూతో బహు జాగ్రత్తగా ప్రవర్తించాలె. అనుభవంమీద వ్రాస్తున్నాను.

సాధారణంగా నీవు అద్దెకు ఇల్లు తీసుకొనేటప్పుడు మీ ఇంటి ప్రక్కవాళ్ళకు

ఫోనుగాని, రేడియోగాని ఉండేటట్లు చూచుకో. సాధారణంగా వెన్నెల రాత్రిళ్ళు, భోజనానంతరం వాళ్ళు ఫోను పెట్టుకొని కూర్చుంటారు. మనకు అది చాలా అనుకూలం. మనకే ఫోనువుంటే, వుండే బాధలు ఏమీ లేకుండా ఫోను వుండటం మూలాన కలిగే సౌఖ్యం అంతా అనుభవించవచ్చు. మన నెవ్వరూ ఫోను ఇవ్వమని అడగరు. రికార్డుల విషయంలో అప్ టు డేట్‌గా మాట్లాడుతూ, స్వంతానికి ఫోను కలిగి వున్న వాళ్ళలాగే మాట్లాడవచ్చును.

"మన ఇంటి ప్రక్కవాళ్ళకు పిల్లలు వుండకూడదు. అంటే నీవు అట్లా కోరాలని నేను అనను. నీవు కోరినంత మాత్రాన వాళ్ళకు పిల్లలు కలుగకుండా వుండటమూ జరగదు. అయినా అటువంటి కోరికలు కోరమని కాదు నేననటము, పిల్లలు లేని సంసారం ప్రక్కనే నీవూ ఉండూ అంటాను."

పిల్లలు వుంటే...

వాళ్ళ పిల్లలకు మన పిల్లలకూ పోట్లాటలు తప్పవు. ఒకమారు నేను వున్న ఇంటిప్రక్క ఆయనకు నలుగురు పిల్లలుండటం తటస్థించింది. ఇక మా అవస్థ చెప్పటానికి వీలులేదు. మొదట్లో వాళ్ళ పిల్లలూ మా పిల్లలూ కలిసి ఆడుకుంటారని సంతోషించాను. కాని ఏం జరిగింది?

వాళ్ళ రాముా ఎర్రకాగితం ఒకటి పుల్లకు గుచ్చి ఆడుకొంటూ వున్నాడు. మా రాధాయ్ చూశాడు దాన్ని. పోనీ తనకూ అటువంటిది ఒకటి కావాలని చెపితే చేసి ఇవ్వనూ. ఊహూ, అల్లాగ చెప్పక, వాడి చేతులో కాగితాన్ని గద్ద తన్నుకొచ్చినట్లు లటిక్కున లాక్కొచ్చాడు. ఇంక వాడి సంగతి, చప్పునవచ్చి నాతోనో, తల్లితోనో, మీ అబ్బాయి నా ఎర్రకాగితం లాక్కున్నాడు. నాది నాకు ఇప్పించండి అని అడగవచ్చునా. మాటలు వచ్చిన వెధవ అహ అట్లా అడక్క, ఠపీమని నేలపై పడిపోయి, కెవ్వున కేకేసి, ఒక్కపెట్టున ఏడ్పు సాగించాడు. బట్టలు బాడి అయినై. వాళ్ళ అమ్మ వొచ్చి ఏమిట్రా నాయినా అని ఎంతో సేపు అడిగితే చివరకు చెప్పాడు ఈ అన్యాయాన్ని గురించి. ఆమె వచ్చి మా ఆవిడ మీద కేకలేసింది. ఏమిటవ్మా, మీ రాధాయ్ పిల్లల చేతుల్లో చిల్లిగవ్వ అయినా నిలవనీయడు. ఠపీమని గద్ద తన్నుకుపోయినట్లు తన్నుకుపోతాడు ఎట్లాగ ఏడ్చేదమ్మా అని. ఈవిడ కూడా అంతేనమ్మా అన్నది. అక్కడ నుంచి వేసుకొన్నారు

పోట్లాట. ఒక అరగంటసాగింది. ఇంతలో మా రాధాయ్ ఆ కాయితం కాస్తా చింపేశాడు. ఆ సంగతి రాముా ఊరుకో పెడదామని ఇంకో ఎర్ర కాయితం ఇస్తే ఒప్పుకోడే! పోనీ ఎన్ని రంగుల కాయితాలిచ్చినా ఒప్పుకోడే! ఆ కాయితం, కావాలంటాడు. చినిగిపోయిందిరా నాయనా ఆ కాయితం, ఇంకోటి తీసుకోరా అంటే వినడే! ఎల్లాగ వీళ్ళ తగూ తీర్చటం!!! కాబట్టి ఇంతకూ చెప్పవచ్చే దేమిటి అంటే ఈ పిల్లల తగూలతో ప్రాణం హైరాన అవుతుంది. కొంచెం ముందుగానే జాగ్రత్తపడి పిల్లా జెల్లా లేనివాళ్ళకు దగ్గరగా వుండడం మంచిది. ప్రక్క ఇంటి వాళ్ళకు పిల్లలు లేకపోతే మన పిల్లలనే ఎత్తుకొని ముద్దాడి మిఠాయి, లడ్డూ, అవీ తరుచు వాళ్ళకు పెడుతూ వుంటారు.

మన ఇంటిప్రక్క వాళ్ళకూ కారు కూడా వుంటే మంచిది. ఎప్పుడైనా అందులో ఎక్కి మనం కూడా షికారు వెళ్ళటానికి అవకాశం వుంటుంది.

మన ఇంటిప్రక్క ఆవిడ చక్కనిదై ఫ్యాషన్ తెలిసినదైతే చాలా అదృష్టం. ఆమె మన ఆడవాళ్ళకు అప్పుడప్పుడు తలదువ్వి పూలు పెట్టి కట్టూబొట్టూ నేర్పుతుంది.

మన పిల్లలను రోజూ ముస్తాబు చేసే పని ఆమెకే అప్పజెప్పెయ్యాలి. మన పిల్లలు ఆమెను అత్తయ్య అని పిలుస్తూ, ఎప్పుడూ అక్కడే కాలం గడుపుతూ ఆడుకుంటూ వుండటం జరుగుతుంది.

దేముడు మేలుచేసి, మన ఇంటిప్రక్క వాళ్ళు డబ్బున్న వాళ్ళు అయివుండాలని మనం కోరుకోవలె. అలాగ అయితే వాళ్ళు మనలను ఎప్పుడూ డబ్బు అప్పు అడగరు. కాస్తో కూస్తో వాళ్ళవద్దే మనము అప్పు పుచ్చుకోవచ్చు.

మన ఇంటి ప్రక్కవారి దొడ్లో కాస్తకాయా కూరా పండుతూ ఉండటం, పూలూ అవీ పూస్తూ వుండటము కూడా అవసరం.

(1962)